క్లుప్తంగా

యువకుడి అదృశ్యం


పోరెడ్డి ఈశ్వరరావు

కురుపాం: స్థానిక దాసరివీధికి చెందిన పోరెడ్డి ఈశ్వరరావు అలియాస్ ప్రభు(22) గత వారం రోజులుగా కనిపించడం లేదంటూ కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. యువకుడికి మతిస్థిమితం సరిగా లేదని, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా జాడ తెలియకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఆచూకి తెలిసిన వారు కురుపాం పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

21న మండల సమావేశం

వీరఘట్టం: ఈనెల 21న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.జయంత్‌ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ దమలపాటి వెంకటరమణ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు అందరూ ఉదయం 10.30 గంటలకు హాజరుకావాలని కోరారు.

మెకానిక్ షెడ్ ఏర్పాటు చేయాలని వినతి


ఫ్లీట్ రూమ్ ఆవశ్యకతను సబ్‌కలెక్టర్‌కు వివరిస్తున్న 108 అధికారులు

పాలకొండ రూరల్: అత్యవసర సమయాల్లో ప్రజలకు సేవలందించే 108, 104, 102 (తల్లి బిడ్డల ఎక్స్‌ప్రెస్) వాహనాలు పాడైనపుడు వాటికి మరమ్మతులు చేపట్టేందుకు ఫ్లీట్ రూమ్ కేటాయించాలని సబ్‌కలెక్టర్ నూరల్ కమర్‌ను 108 సిబ్బంది కోరారు. ఈ మేరకు సబ్‌కలెక్టర్‌తో పాటు తహసీల్దార్ పి.సోమేశ్వరరావుకు శనివారం వినతిపత్రాలు అందజేశారు. పాలకొండ డివిజన్‌లో ఈ వాహనాలు 50 వరకు ఉన్నాయని, ఏదైనా వాహనం పాడైతే వాటిని పార్వతీపురం, శ్రీకాకుళం తీసుకువెళ్లి బాగుచేయించాల్సి వస్తోందని, అందుకు కాలయాపన జరుగుతోందని అన్నారు. ఆ సమయంలో ప్రజలకు సేవలు అందక ఇబ్బంది పడుతున్నారని వివరించారు. స్థానికంగా వాహనాల మరమ్మతులు చేయించేందుకు మెకానిక్ షెడ్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో 108 అధికారులు బి.వి జయ్‌కుమార్, జిల్లా మేనేజర్ మన్మథనాయుడు, జిల్లా ఫ్లీట్ మేనేజర్ జగ్గ రాజు, భాస్కర్, గిరి గణపతి తదితరులున్నారు.

వీఓఏ వసూళ్లపై విచారణ


గ్రామంలో విచారణ చేపడుతున్న ఏపీఓ శివున్నాయుడు

వీరఘట్టం: మండలంలోని కంబరవలస గ్రామ సంఘం సహాయకురాలు(వీఓఏ) సంక్షేమ పథకాల లబ్ధిదారుల నుంచి రూ.100 చొప్పున వసూలు చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుపై శనివారం ఏపీఓ శివున్నాయుడు గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. గ్రామ సంఘంలో ఉన్న మహిళలు రూ.100 చొప్పున ఇస్తున్నారని, అయితే కొందరు స్వచ్ఛందంగా ఇస్తున్నట్లు తెలిపారని, ఇంకొందరు మాత్రం తమ వద్ద బలవంతంగా వసూలు చేస్తున్నట్లు విచారణలో తెలిపారన్నారు. నివేదికను జిల్లా అధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతామన్నారు.

ఎంపీడీఓగా మల్లికార్జునరావు


ఎంపీడీఓకు స్వాగతం పలుకుతున్న ఏఓ రమేష్‌బాబు, సిబ్బంది

కొమరాడ: మండలంలోని ఎంపీడీఓగా పనిచేస్తున్న ఎల్‌వీ అప్పారావు పదోన్నతిపై శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొత్తగా వచ్చిన ఎం.మల్లికార్జునరావు శనివారం ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. ఆయనకు మండల పరిషత్ సిబ్బంది అభినందనలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ.. మీ అందరి సహకారంతో మండల అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానన్నారు.

తల్లిదండ్రులు చెంతకు తప్పిపోయిన బాలిక

పార్వతీపురం టౌన్: మండలంలోని ఎంఆర్ నగరానికి చెందిన మౌనిక తన ఐదేళ్ల కుమార్తె యోగితతో శనివారం ఉదయం పార్వతీపురం పట్టణానికి షాపింగ్ నిమిత్తం వచ్చింది. తల్లిదండ్రులతో వచ్చిన యోగిత షాపింగ్ సమయంలో తప్పిపోయింది. గుర్తించిన తల్లిదండ్రులు పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఈ విషయం తెలుసుకున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ కిశోర్, హెచ్‌సీ కైలాష్ పట్టణంలో వెతికారు. చిన్నారిని గుర్తించి పట్టుకున్నారు. తల్లిదండ్రులకు అప్పగించారు. కానిస్టేబుళ్లకు యోగిత తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

వస్తున్నాయ్ జగన్నాథ రథచక్రాల్

- ఈనెల 20 జగన్నాథ స్వామి రథయాత్ర
- పది రోజుల పాటు ప్రత్యేక పూజలు
- రోజుకో అవతారంలో స్వామివారి దర్శనం
- భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు


భక్తుల పూజలందుకునేందుకు సిద్ధమవుతున్న సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు


పాలకొండలోని జగన్నాథస్వామి ఆలయం

పాలకొండ రూరల్: పాలకొండ పట్టణంలో వెలసిన సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి ఆలయం రథోత్సవానికి ముస్తాబవుతోంది. ఈ నెల 20 నుంచి స్వామివారి రథోత్సవం ప్రారంభం అవుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి వి.రాధాకృష్ణ తెలిపారు. ఒడిశాలోని పూరిలో జగన్నాథ స్వామివారికి ఏవిధంగా పూజా కార్యక్రమాలు జరుగుతాయో అదే విధంగా ఇక్కడ కూడా పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పదిరోజుల పాటు స్వామివారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. జూన్ 30న స్వామివారు ప్రధాన ఆలయంలోకి తిరిగి వెళ్లడంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రధాన అర్చకుడు మఠం విశ్వనాథ దాసు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్పీ జీవీ కృష్ణారావు చెప్పారు.

ఆలయ చరిత్ర..

పాలకొండ జగన్నాథస్వామి ఆలయాన్ని దేవాదాయ శాఖలో 1950లో విలీనం చేశారు. గుడించా మందిరం, ప్రధాన దేవాలయానికి మధ్య సుందర ప్రాకారాన్ని తవ్వించి భగవంతుని సేవ నిమిత్తం నిర్మయించారు. అనంతరం శ్రీదేవకీ దేవి(పిన్నమ్మ) గుడి కట్టించారు. జేష్ఠ్య పౌర్ణమి నాడు నేత్రాభిషేకాన్ని జరిపి స్వామివారిని చీకటి గదిలో ఉంచుతారు. ఆ చీకటి గదిలో మహంతు, పూజారులు స్వామివారి నేత్రాలను తుడుస్తారు. ఇదే జగన్నాథస్వామి ఇతివృత్తాంతంగా అర్చకులు పేర్కొంటున్నారు. పట్టణంలో ఈశాన్యం వైపుగా ఒడిశా పూరి జగన్నాథస్వామి ఆలయ సాంప్రదాయం మేరకు స్థానిక ఆలయం రూపుదిద్దుకుంది. నిత్యాభిశేఖం సుదర్శన చక్రానికి చేపట్టడం విశేషం.

ఒడిశా మాదిరి రథాయాత్ర..

ఒడిశాలోని పుణ్యక్షేత్రం పూరిలో జగన్నాథుని రథాయాత్ర జరిగే విధంగానే ఇక్కడకూడా సాంప్రదాయబద్ధంగా స్వామి రథాయాత్ర సాగుతుంది. ప్రధాన ఆలయం నుంచి పిన్నమ్మదేవి గుడి మీదుగా గుడించామందిరం వరకు భక్తులు ఆనందోత్సాహాలతో రథోత్సవం జరుగుతుంది. జగన్నాథుడు, సుభద్ర, బలరామస్వామి ఆశీనులైన రథాన్ని ప్రజలు భక్తి పారవశ్యంతో లాగుతారు. ఆ సమయంలో రథంపై ఉన్న ముగ్గురు మూర్తులను సందర్శిస్తే పునర్జన్మ ఉండదని ప్రజల నమ్మకం.

స్వామివారి అవతారాలు ఇలా..

ఈ నెల 20న తొలిదశిమి, 21న ప్రత్యేక పూజలు, అభిశేఖాలు, అర్చనలు, 22న మత్స్యావతారం, 23న కూర్మావతారం, 24న వరహానరసింహా అవతారం (హిరాపంచమి), 25న వామన పరుశురామావతారం, 26న రామ బలరామ అవతారం, 27న కల్కి జగన్మోహిని అవతారం, 28న మారుదశమి(స్వామి వారి నిజరూప దర్శనం), 29న తిరుగుయాత్ర (మారుయాత్ర), 30న స్వామి ప్రధాన దేవాలయ ప్రవేశం నిర్వహించనున్నారు.

నేడు స్వామివారికి నేత్రోత్సవం


ముస్తాబవుతున్న జగన్నాథుని రథం

వీరఘట్టం: మండల కేంద్రంలోని జగన్నాథ స్వామి ఆలయం రథయాత్ర మహోత్సవాలకు సిద్ధమవుతోంది. యాత్రను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం స్వామివారి నేత్రోత్సవం నిర్వహించనున్నారు. ఈ నెల 20న స్వామివారిని ప్రధాన ఆలయం నుంచి రథంపై ఊరేగింపుగా కాలేజీ జంక్షన్ వద్ద ఉన్న గుండిచ మందిరానికి తీసుకువస్తారు. 28 వరకు స్వామివారు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమిస్తారు. 24న హిరాపంచమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ వి.రాధాకృష్ణ, అర్చకులు లింగ రాజ్ రథో తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో రథోత్సవంలో పాల్గొనాలని కోరారు.

ముగిసిన అధ్యాపకుల శిక్షణ

పార్వతీపురం టౌన్: స్థానిక శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వారం రోజులుగా అధ్యాపకులకు జరుగుతున్న శిక్షణ తరగతులు శనివారం ముగిసినట్టు కళాశాల ప్రిన్సిపాల్, ఎన్‌ఆర్‌సీ కేంద్రం ప్రిన్సిపాల్ డాక్టర్ చలపతిరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోని ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు ఆంగ్ల భాష పరిజ్ఞాన నైపుణ్యతపై ఇంగ్లిష్ స్కిల్స్ పెంచేందుకు రాష్ట విద్యా శాఖ కమిషనర్ పోల భాస్కర్ ఇచ్చిన ఆదేశాల మేరకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ శాంతికుమారి, ఉమ్మడి జిల్లాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పోషకాహార కిట్ల పంపిణీ


పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో క్షయ రోగులకు ఆర్డ్స్ స్వచ్ఛంద సంస్థ, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో పోషకాహార కిట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏడుగురు రోగులకు బియ్యం, పప్పులు, నూనెలు, ఎండు ఖర్జూరం, బాదంపప్పు, ఏడురకాల వస్తువులతో పాటు రూ.500లు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ గౌరీశంకర్, వైద్యాధికారి వెంకటరావు, ఆర్డ్స్ సమన్వయకర్త బి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

డయేరియా రోగులకు మెరుగైన వైద్యం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు


గుమ్మలక్ష్మీపురం: బొడ్డిడి గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు



కురుపాం: సీహెచ్‌సీలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

గుమ్మలక్ష్మీపురం: డయేరియాతో బాధడుతున్న గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు తెలిపారు. మండలంలోని జర్న పంచాయతీ బొడ్డిడి గిరిజన గ్రామంలో డయేరియా కేసులు నమోదు కావడంతో శనివారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని పరిశీలించి ఇప్పటివరకు నమోదైన డయేరియా కేసులు, వారికి అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కురుపాం, దుడ్డుఖల్లు ఆస్పత్రుల వద్ద డయేరియా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని, ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. గ్రామంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకరరావు, డీఈఈ నాగేశ్వరరావుతో కలిసి గ్రామస్తులు వినియోగిస్తున్న తాగు నీటి ట్యాంక్, కుళాయి కనక్షన్లను పరిశీలించారు. గ్రామస్తులు వినియోగిస్తున్న నీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించినట్లు చెప్పారు. వారి వెంట దుడ్డుఖల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

వైద్యసేవలపై డీఎంహెచ్‌ఓ ఆరా..

కురుపాం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగన్నాథరావు శనివారం సందర్శించారు. గుమ్మలక్ష్మీపురం మండలం బొడ్డిడి గిరిజన గ్రామంలో డయేరియా బారిన పడిన 25 మంది రోగులకు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో వారికి అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కురుంపాం సబ్‌సెంటర్‌ను పరిశీలించి మందుల నిల్వలను, గర్భిణులు, బాలింతలు, హైరిస్క్ కేసుల వివరాలను ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏపీడీ మాలాజి, డాక్టర్ నవీన్, సిబ్బంది ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి 'జగనన్న సురక్ష'


గరుగుబిల్లి: మాట్లాడుతున్న డీపీఓ సత్యనారాయణ

గరుగుబిల్లి: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ సిబ్బందికి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జగనన్న సురక్ష కార్యక్రమం అమలుపై పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులతో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 23న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, 24 నుంచి మన జిల్లాలో ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. దీని ద్వారా ప్రజలకు వీలైనంత ఎక్కువ సర్వీసులు అందించాలన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతీ ఇంటికి తిరిగి వారి సమస్యలు తెలుసుకోవాలని, సమస్యలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలని, వాటిపై విచారణ నిర్వహించి, గ్రామంలో పర్యటించే మండల టీం ద్వారా సదరు సమస్యలకు పరిష్కారం చూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువపత్రాలు, జనన, మరణ ధ్రువపత్రాలు, ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్లు, వివాహ సర్టిఫికెట్స్, మ్యుటేషన్లు తదితర సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ పీఎస్ లక్ష్మీకుమార్, ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండ: ఈ నెల 23 నుంచి అమలు చేయనున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు గ్రామాల్లో సమగ్ర సర్వే నిర్వహించాలని నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు సూచించారు. పట్టణంలోని సచివాలయ సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. జగనన్న సురక్షలో భాగంగా సిటిజన్ చార్టు కొత్తగా రూపొందిస్తున్నామన్నారు. జూలై 1 నుంచి ఏపీ పోర్టల్‌లో కొత్తగా 9 రకాల సేవలను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. నగరపంచాయతీ పరిధిలోని 9 సచివాలయాల సిబ్బంది సురక్ష సర్వేని చిత్తశుద్ధితో చేయాలని సూచించారు.

పక్కాగా జగనన్న సురక్షా కార్యక్రమాలు

భామిని: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ గుండెలా చందరరావు అధ్యక్షతన తహసీల్దార్ నీలాపు అప్పారావు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం అమలుపై శనివారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి చేరేలా, ప్రతీ కుటుంబానికి అవసరమైన వివిధ ధ్రువీకరణ పత్రాల మంజూరు చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశంగా పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతీ ఇంటికి వెళ్లి సర్వే చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రమేష్ కుమార్, నిమ్మల శేఖరం, ఈఓపీఆర్డీ గుర్ల కృష్ణారావు, తదితరులున్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి


కొత్తూరులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి: పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొత్తూరు గ్రామంలో శనివారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. దేశంలో మరే రాష్ట్రంలో కూడా అమలు చేయని గ్రామ సచివాలయ వ్యవస్థను ఆంధ్రప్రదేశ్‌లో పెట్టిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా అవినీతికి ఆస్కారం లేకుండా అర్హుల ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలను అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, స్థానిక సర్పంచ్ ద్వారపురెడ్డి రజని, మాజీ ఎంపీపీ ద్వారపురెడ్డి ధనుంజయరావు, సీనియర్ వైద్యులు డి.రామ్మోహనరావు, నాయకులు పి.శ్రీధర్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

గిరిజనోద్యమ నేత మండంగి మృతికి సంతాపం


మండంగి బొంకు భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న గిరిజన సంఘం నాయకులు

కురుపాం: శ్రీకాకుళం గిరిజన ఉద్యమనేత మండంగి బొంకు అనారోగ్యంతో తన స్వగ్రామమైన కురుపాం మండలం తోలుంగూడ గ్రామంలో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న గిరిజన సంఘం, సీపీఎం నాయకులు, ప్రజాప్రతినిధులు శనివారం గ్రామానికి వెళ్లి బొంకు మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, వైస్ ఎంపీపీ బిడ్డిక అన్నాజీరావు మాట్లాడుతూ శ్రీకాకుళం గిరిజన ఉద్యమంలో కోరన్న, మంగన్నలతో కలిసి మండంగి పాల్గొన్నారన్నారని, గిరిజన హక్కులపై పోరాటాలు చేసి అందరికి ఆదర్శప్రాయుడిగా నిలిచారన్నారు. గిరిజన సంఘం జిల్లా నాయకులు కె.సీతారాం, గౌరవాధ్యక్షులు ఎం.రమణ, బిడ్డిక వెంకటరావు, తిరుపతి, సత్యం, అప్పలస్వామి, అద్దమేశ్వరరావు, కోలక అవినాష్, కొల్లి గంగునాయుడు తదితరులు మండంగి మృతికి సంతాపం తెలియజేశారు.

ఉపాధి మస్తర్ల తనిఖీ


మస్తర్లు తనిఖీ చేస్తున్న ఏపీఓ శ్రీనివాసరావు

జియ్యమ్మవలస: మండలంలోని ఇటిక గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. వేతనదారులు ఎంతమంది హాజరయ్యారు, మస్తర్లలో ఎంతమంది హాజరు ఉంది, పని ప్రదేశం వద్ద సౌకర్యాలు ఉన్నాయా లేదా, తదితర అంశాలను పరిశీలించారు. తప్పుడు మస్తర్లు నింపితే సంబంధిత టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండు పూటలా పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన వేతనాన్ని పొందాలని కూలీలకు సూచించారు.
– భామిని: మండలంలోని బిల్లుమడలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీఓ జి.చందరరావు, ఏపీఓ ఇ.తులసీదాస్ శనివారం పరిశీలించారు. మస్తర్లను తనిఖీ చేసి అందులో నమోదైన వేతనదారులు పనిప్రదేశంలో ఉన్నారో లేదో గుర్తించారు. పూర్తిస్థాయి వేతనం పొందేలా పనులు కేటాయించాలని ఎఫ్ఏ కిషోర్‌ను ఆదేశించారు.

కొనసాగుతున్న ఆయుష్మాన్ సర్వే


కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలు నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది

భామిని: మండలంలోని బత్తిలి పీహెచ్‌సీ పరిధిలో చేపట్టిన ఆయుష్మాన్ భారత్ సర్వే కొనసాగుతోంది. మనుమకొండ, పాలవలస గ్రామాల్లో శనివారం సర్వే చేపట్టారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న రోగులు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించి ఎస్‌సీడీసీడీ యాప్‌లో నమోదు చేశారు. ప్రతీ ఒక్కరికీ ఆరోగ్య కార్డులను ప్రభుత్వం మంజూరు చేస్తుందని వివరించారు. బత్తిలి వైద్యాధికారులు కె.రవీంద్ర, దామోదరరావు పర్యవేక్షణలో ఈ సర్వే జరుగుతోంది.

వీఆర్‌వోల సంఘ అధ్యక్షుడిగా రాంబాబు

బలిజిపేట: మండల వీఆర్‌వోల సంఘం అధ్యక్షుడిగా యు.రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన మండల వీఆర్‌వోల సంఘం ఎన్నికల్లో రాంబాబును అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా మనోజ్, ఉపాధ్యక్షునిగా స్వామినాయుడు, కోశాధికారిగా రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు వీఆర్‌వోలు తెలిపారు. కొత్త కార్యవర్గాన్ని తహసీల్దార్ అప్పలరాజు అభినందించారు.

'ఆణిముత్యాలు'కు అభినందనలు


సీతంపేట: ప్రశంసా పత్రాలతో ఏపీటీడబ్ల్యూఆర్ మల్లి పాఠశాల విద్యార్థులు

ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు గాను రాష్ట ప్రభుత్వం 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం కింద నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తోంది. పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి నగదుతో పాటు ప్రశంసా పత్రాలను అందించి సత్కరిస్తోంది. ఇందులో భాగంగా పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన పలువురు విద్యార్థులకు స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలు అమలు చేస్తోందని అన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్


పాలకొండ: బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులను సన్మానిస్తున్న కౌన్సిలర్లు


భామిని: బాలేరు జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు


వీరఘట్టం: ప్రశంసా పత్రాలు అందుకున్న తలవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు

రైతు ఆదాయం పెంచేలా ప్రణాళిక


గొట్టివలసలో వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీడీ శ్రీహరి

గరుగుబిల్లి: రైతులకు ఆదాయ వనరులు సమకూర్చే ప్రణాళికలు చేస్తున్నట్లు ఉపాధిహామీ పథకం ఏపీడీ జి.శ్రీహరి అన్నారు. మండలంలోని గొట్టివలస, ఉల్లిభద్ర, రావుపల్లి, గరుగుబిల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శనివారం ఆయన పరిశీలించారు. వ్యవసాయంతో పాటు అదనపు ఆదాయం పెంచేందుకు వీలుగా ఉద్యాన పంటల సాగుకు అవసరమైన సహకారం అందిస్తున్నామన్నారు. మామిడి, జీడి, సపోటాలతో పాటు పలు రకాల పంటల సాగుకు రైతులు ముందుకు రావాలన్నారు. ఉపాధిహామీ పథకంలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఉపాధిహామీకి సంబంధించి రికార్డుల నిర్వహణలో అలసత్వం వహించరాదన్నారు. ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, ఏపీఓ టి.రామకృష్ణ ఉన్నారు.